క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతల ఇఫ్తార్ విందు



విస్సన్నపేట: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేసే ముస్లింలకు విస్సన్నపేటలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్య నారాయణరెడ్డి శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాసు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, స్థానిక ఎంపీటీసీ జి. మల్లయ్య, మాజీ సర్పంచి లక్ష్మయ్య, నాయకులు దామోదరరెడ్డి, శేషగిరి, కోట శ్రీను, పవన్ తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు రిక్షాలు అందజేత

మైలవరం: మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం వై.జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐ లవ్ మైలవరం లోగోను శుక్రవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మైలవరం మండలాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామ పంచాయతీకి గ్రామంలో సేకరించిన చెత్తను తరలించేందుకు ఏర్పాటు చేసిన రిక్షాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం కల్పించేలా రచనలు

పసుపులేటి వెంకయ్య

తిరువూరు: సామాజిక స్పృహతో కవులు రచనలు చేస్తే ప్రయోజకరంగా ఉంటుందని తిరువూరు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య అన్నారు. తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని స్థానిక బస్టాండు సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వారికి న్యాయం జరిగే విధంగా కవితలు ఉండాలన్నారు. తిరువూరు రచయితల సంఘ అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్, సంఘ సభ్యులు తోట ఉమామహేశ్వరరావు, రాధారాణి, వజ్రాల ఇందిర, భరతకుమారి, నండూరి అనురాధ, దారా మాధవి, విశ్వనాథుని శంకరాచారి తదితరులు కవి సమ్మేళనం నిర్వహించారు.

శ్రీకర కో–ఆపరేటివ్ సొసైటీ శాఖ ప్రారంభం




ఇబ్రహీంపట్నం: శ్రీకర కో–ఆపరేటివ్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ నూతన శాఖను ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు, ఫిన్వెస్కో హోల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కంపూడి రవీంద్ర మాట్లాడుతూ శ్రీకర మ్యాక్స్ ఆర్థిక సాధికారితపై దృష్టి సారించి డిపాజిట్లపై అధిక వడ్డీ, వ్యాపార, మహిళా సంఘాలకు రుణాల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు. పట్టణ ప్రజలు సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసి చెక్కులు అందించారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, సీఏ చంద్రశేఖర్, శ్రీకర మ్యాక్స్ అధ్యక్షుడు చంద్రశేఖర్, బ్రాంచి మేనేజర్ సాయి, వివిధ బ్రాంచిల ప్రతినిధులు పాల్గొన్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి తండాలో శుక్రవారం కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో నిర్వహించామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ధారవతు పెద్ద బాలు, భూక్యా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని ఘటనా స్థలం నుంచి పారిపోయిన హసావతు విజయ, బాలుపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో కైకలూరు, నూజివీడు ఎక్సైజ్, చాట్రాయి పోలీసులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ అందజేత



ఆగిరిపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు అడవినెక్కలం సర్పంచ్ వేము రాజు వాటర్ కూలర్‌ను అందించారు. శుక్రవారం వాటర్ కూలర్‌ను ఎంపీడీఓ ఆనంద్ బాబు, ఏఓ అబ్దుల్ సలాం సమక్షంలో ప్రారంభించారు.

పక్కదారి పడుతున్న ఉచిత ఇసుక

- తెలంగాణకు అక్రమంగా రవాణా
- అనుమతులు లేకుండా వాగుల్లో తవ్వకాలు
- దండుకుంటున్న దళారులు



తెలంగాణకు తరలుతున్న ఉచిత ఇసుక టిప్పర్లను స్వాధీనం చేసుకున్న తిరువూరు పోలీసులు (ఫైల్)

తిరువూరు: పేదల ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని పలువురు దళారులు వ్యాపార అవసరాలకు మళ్లిస్తున్నారు. ఇబ్రహీంపట్నం, కంచికచర్ల తదితర ప్రాంతాల నుంచి కృష్ణా నదిలో ఉచిత ఇసుకను తిరువూరు చుట్టుపక్కల గ్రామాలకు బుక్ చేస్తున్న దళారులు సమీపంలోని తెలంగాణకు తరలిస్తున్నారు. రోజుకు 50కి పైగా టిప్పర్లలో కృష్ణా నది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఒక్కొక్క టిప్పరు ఇసుక ధర రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు నిర్ణయించి విక్రయిస్తున్నారు.

జాతీయ రహదారిపై రవాణా

ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరు సమీపంలోని తెలంగాణ సరిహద్దు వరకు రెవెన్యూ, పోలీస్ శాఖలకు ఎటువంటి చెక్‌పోస్టులు లేకపోవడంతో ఇసుక తరలింపునకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. పోలీసులు ప్రత్యేకంగా వాహనాలు తనిఖీ చేసినప్పుడు దొరికితేనే ఇసుక లారీలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇటీవల తిరువూరు పోలీసులు ఇసుకతో ఖమ్మం జిల్లాకు వెళుతున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకోగా అన్నీ తిరువూరు చిరునామాతోనే నమోదై ఉన్నాయి. ఖమ్మం–విశాఖపట్నం హైవేకు, ప్రైవేటు భవన నిర్మాణాలకు ఇసుకను దళారులు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

వాగుల్లో యథేచ్ఛగా తవ్వకాలు

ఉచిత ఇసుకను తవ్వుకునేందుకు సమీప సచివాలయంలో ముందుగా అనుమతి తీసుకోవాలనే నిబంధన తిరువూరు డివిజన్‌లో అమలుకు నోచుకోవడం లేదు. ట్రాక్టర్ల యజమానులు ఉచిత ఇసుక బ్యానర్ తగిలించుకుని తమ ఇష్టానుసారం కట్టేలేరు, పడమటివాగులలో ఇసుక తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రం మధిర, వైరా, కల్లూరు మండలాల్లో అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు తమకు ఉచిత ఇసుకపై నియంత్రణ లేదని చేతులు దులుపుకుంటుండగా, రాత్రివేళ సైతం వాగుల్లో ఇసుక తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి.

తనిఖీ చేస్తున్నాం



ఇసుక రవాణా చేసే వాహనాలను తనిఖీ చేసి తెలంగాణకు తరలిస్తున్నట్లు గుర్తిస్తే సీజ్ చేస్తున్నాం. ఉచిత ఇసుకను స్థానిక అవసరాలకు మాత్రమే వినియోగించాలి. ఎవరైనా ఇసుకను తెలంగాణకు తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం.

– సత్యనారాయణ, తిరువూరు ఎస్ఐ

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



నూతన తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వసంత

మైలవరం: తల్లిదండ్రుల లక్ష్యాలు, దాతల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఎదగాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.3.90 కోట్ల అంచనాలతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాతలు కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మైలవరం ప్రాంతం విద్యార్థులందరూ బాగా చదువుకోవాలనే ఉన్నతాశయంతో డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తాను కష్టపడి సంపాదించిన దానిలో కొంత భాగాన్ని ఇక్కడ విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని చెప్పారు. దాతల లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కళాశాల మైదానంలో అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్ మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 60 మంది గైర్హాజరు



నూజివీడు పట్టణంలోని సెయింట్ ఆన్స్ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

నూజివీడు: నియోజకవర్గ పరిధిలోని 18 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించగా మొత్తం విద్యార్థులు 3,440 మందికి గానూ 60 మంది గైర్హాజరవ్వగా 3,380 మంది పరీక్షలు రాశారు. నూజివీడు పట్టణంతో పాటు మండలంలో కలిపి 10 పరీక్ష కేంద్రాల్లో 1,845 మందికి గానూ 35 మంది గైర్హాజరవ్వడంతో 1,810 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 436 మందికి గానూ ఆరుగురు గైర్హాజరవ్వగా 430 మంది, ముసునూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 592 మందికి గానూ 10 మంది గైర్హాజరవ్వగా 582 మంది, ఆగిరిపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 567 మందికి గానూ 9 మంది గైర్హాజరవ్వడంతో 558 మంది పరీక్షలు రాశారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

సీపీఎం నేత మేకల నాగేంద్రప్రసాద్



చింతల కాలనీలో మురుగు కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తిరువూరు: స్థానిక మధిర రోడ్డులోని చింతల కాలనీలో మురుగునీటి పారుదలకు కచ్చా డ్రెయిన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చింతలకాలనీలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. కాలనీలో ఎక్కడా పక్కా డ్రెయినేజీలు లేక మురుగునీరు నివాస గృహాల నడుమ, రోడ్లపై నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు పార్టీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సైతం కాలనీలో పర్యటించినప్పుడు డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ప్రయోజనం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో కాలనీలో మురుగునీటి కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయని, వెంటనే పక్కా డ్రెయిన్ నిర్మించాలని కోరారు. స్థానికుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళతామని నాగేంద్రప్రసాద్ తెలిపారు. ప్రజా చైతన్య యాత్రలో పార్టీ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, మరకాల రాము, చింతయ్య, ఆకుల రవి, బలగాని వెంకటేశ్వరరావు, బల్లిపర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మైలవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం లబ్ధిదారులకు తన కార్యాలయంలో అందజేశారు. మైలవరం మండలానికి సంబంధించి 16 మందికి గాను రూ.6,78,296, జి.కొండూరు మండలంలోని 25 మందికి రూ.8,43,054, మరో ఆరుగురికి రూ.18.50 లక్షల ఎల్ఓసీలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు.

సర్పంచ్ వర్సెస్ వార్డు సభ్యులు

- లెక్కలు చెప్పాలంటూ సర్పంచ్‌పై వార్డు సభ్యుల తిరుగుబాటు



గ్రామ సభలో సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య వాగ్వివాదం (ఫైల్)

జి.కొండూరు: మైలవరం పంచాయతీలో ఇద్దరు వార్డు సభ్యులు వర్సెస్ సర్పంచ్ వివాదం రచ్చకెక్కింది. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన గ్రామ సభలను ముడుపుల చర్చా వేదికగా మార్చారు. వివరాలలోకి వెళ్తే.. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మైలవరం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవితో పాటు 20 మంది వార్డు సభ్యులకు గానూ 19 మంది వార్డు సభ్యులు వైఎస్సార్ సీపీ నుంచి ఎన్నికయ్యారు. ఇటీవల సర్పంచ్‌తో పాటు ముగ్గురు వార్డు సభ్యులు కూటమిలో చేరారు. సర్పంచ్ పార్టీ మారినప్పటికీ గ్రామ సభలలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు వైఎస్సార్ సీపీకి చెందిన 16 మంది వార్డు సభ్యులు సహకరిస్తున్నారు. కానీ పార్టీ మారిన ముగ్గురు వార్డు సభ్యుల్లో 12వ వార్డు సభ్యుడు ముద్దర నాగ వెంకట చిట్టిబాబు, 18వ వార్డు సభ్యుడు యర్రా రమేష్ కుమార్ వర్సెస్ సర్పంచ్‌గా గ్రామ సభల్లో వివాదాలు జరుగుతున్నాయి.

ఖర్చులు చెప్పాలంటూ వేధింపులు

గ్రామ పంచాయతీలో ఖర్చులు లెక్కలు చెప్పాలంటూ, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కామన్‌సైట్లు లేకుండా అనుమతులు ఎలా ఇస్తున్నారంటూ సదరు ఇద్దరు వార్డు సభ్యులు పట్టుబట్టడం, దీనిపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేయడంతో సభలు రసాభాసగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 17న జరిగిన గ్రామ సభ కూడా రసాభాసగా మారింది.

అట్రాసిటీ కేసు

గ్రామ సభలో కులం పేరుతో దూషించారంటూ సర్పంచ్ మంజుభార్గవి మైలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ ఇద్దరు వార్డు సభ్యులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు.

రూ.25 లక్షలు ఇప్పించాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు

రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి రూ.25 లక్షలు ఇప్పిస్తే తన జోలికి రానంటూ 12వ వార్డు సభ్యుడు చిట్టిబాబు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని సర్పంచ్ మంజుభార్గవి 'సాక్షి'కి తెలిపారు. చిట్టిబాబు గత గ్రామ సభలో మినిట్ బుక్‌ని తనపై విసరడంతో గాజులు పగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం డబ్బు కోసమే తనను బ్లాక్‌మెయిల్ చేస్తూ సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చిట్టిబాబు జగనన్న కాలనీ లేవుట్‌లో ప్లాట్లను ఫోర్జరీ సంతకాలతో విక్రయించినట్లు ఆరోపణలు కూడా వచ్చాయన్నారు. 18వ వార్డు సభ్యుడు రమేష్ కూడా చిట్టిబాబుతో కలిసి తనపై కులం పేరుతో దూషణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేయడం శుభపరిణామమన్నారు.

–గరికపాటి మంజుభార్గవి, సర్పంచ్

ఉపాధి పనుల్లో ఏపీఓ తీరుపై ఆగ్రహం

- సమాధానం చెప్పాలని ప్రజాప్రతినిధుల పట్టు
- కచ్చితంగా సమాచారం ఇస్తామని ఎంపీడీఓ హామీ
- వాడీవేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఏపీఓని ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

చాట్రాయి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. అధికారుల సమీక్షా సమావేశంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో పనులను గుర్తించేటప్పుడు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను సంప్రదించకుండా వారి ఇష్టం వచ్చిన పనులను ఎంపిక చేస్తున్నారని ఏపీఓ విజయలక్ష్మిపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సిబ్బంది తెలియజేస్తున్నారని ఆమె బదులివ్వడంతో ఎవరికి చెప్పారో? చెప్పాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎంపీడీఓ ఐ.విజయలక్ష్మి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు కచ్చితంగా సమాచారం ఇస్తామని హామీ ఇచ్చారు.

మట్టి తోలకాలకు అనుమతి లేదు.. కూటమి వారు తరలిస్తే ఆపరు

మండల పరిషత్ నిధులతో ఆయా గ్రామాల్లో రోడ్లను అభివృద్ధి చేసేందుకు గ్రావెల్ తోలకాలకు రెవెన్యూ శాఖ అనుమతులు ఇవ్వడం లేదని పర్వతాపురం సర్పంచ్ మిద్దె శివాజీ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మట్టి తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతి తీసుకోవాలని ఆర్ఐ వెంకటరమణ బదులు ఇవ్వడంతో ప్రతి రోజూ ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు మట్టిని తరలిస్తుంటే వారిని ఎందుకు ఆపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు అడిగితే ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. అనుమతులు ఇవ్వకపోతే మంజూరైన మండల పరిషత్ నిధులు మురిగిపోయే పరిస్థితులు నెలకొంటాయని ఎంపీటీసీ సభ్యులు కృష్ణ, చింతగుంట్ల వెంకటేశ్వరరావు తదితరులు ఆవేదన వ్యక్తంచేశారు. జగనన్న కాలనీల్లో పూర్తి అయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు సభకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకా నిర్మల, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వుచ్చుకాయల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చెలికాని అనూషా, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఐ ప్రచార జాతా



నూజివీడు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహించనున్న ప్రచార జాతా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని అమర్ భవన్‌లో శుక్రవారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీల్లో నూజివీడు నియోజకవర్గంలో ప్రచార జాతా బృందం పర్యటిస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు, కూచిపూడి నాగేశ్వరరావు, రాయంకుల లక్ష్మణరావు, మాదిరెడ్డి శ్రీనివాసరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు సర్కిల్‌లో ఎక్సైజ్ అధికారుల దాడులు

తిరువూరు: సారా నిర్మూలనలో భాగంగా తిరువూరు సర్కిల్‌లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో మోపెడ్‌పై సారా తరలిస్తున్న కొమరగిరి సంధ్యారావును, సారా విక్రయించిన వడిత్యా జాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాలో పొలంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 70 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి తయారీదారు జ్యోతిని అరెస్టు చేశారు. పొలం యజమాని బాలుపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ తెలిపారు. విస్సన్నపేట మండలం నరసాపురంలో సారా తయారీదారులు నక్కా నాగేంద్రబాబు, జానెబోయిన కృష్ణ, వావిలాలలో మొగిలి మారయ్య, దుగ్గిరాల నాగరాజు, గంపలగూడెంలో బెల్లం వ్యాపారి కొర్రా శ్రీనివాసరావులను అరెస్టు చేసి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐలు వెంకట కుమార్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



నూజివీడు: క్రీస్తు బోధనలు ఆచరణీయమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో రూ.1.71 కోట్లతో చేపట్టిన సిలువ గట్టు రోడ్డు పనులకు మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చర్చి పెద్దలు, పాస్టర్లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం

జూపూడి(ఇబ్రహీంపట్నం): అంతర్జాతీయ దంత వైద్య సమాఖ్య పిలుపు మేరకు నిమ్రా దంత వైద్యశాల ఆధ్వర్యంలో వారం రోజులుగా జరిగిన నోటి ఆరోగ్య వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సమావేశంలో ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజలు దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారం పాటు నిర్వహించిన వైద్య శిబిరాల వివరాలు ప్రొఫెసర్ సురేష్ వివరించారు. ఈ సందర్భంగా సీఈ నాగరాజును సత్కరించారు. వ్యాస రచన పోటీల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఫ్యాకల్టీ అప్డేషన్'

మైలవరం: సైబర్ సెక్యూరిటీ ఇన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రాజెక్టు అని కాకినాడ జేఎన్టీయూకే రెక్టార్, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కేవీ రమణ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గత ఐదు రోజులుగా నిర్వహించిన ఫ్యాకల్టీ అప్డేషన్ ప్రోగ్రామ్ శుక్రవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ జేఎన్టీయూ కాకినాడతో సంయుక్తంగా నిర్వహించే ఈ ప్రోగ్రామ్‌కు హోస్ట్‌గా తమ కళాశాలను ఎంచుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌కు చెందిన అదితి సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీరామ్‌కుమార్, ఫ్యాకల్టీ అప్డేషన్ ప్రోగ్రామ్ వక్తలుగా డాక్టర్ రాజేంద్ర పాముల, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐఎస్ఎమ్ ధన్‌బాద్ డాక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ముసునూరు: చెక్కపల్లిలో భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏడేళ్ల కిందట నిర్మించిన ఆలయంలో నిర్మాణ దాత అంకుశరావు తిరుపతిరావు దంపతులు అభిషేకాలు, హోమం, పూజాధికాలు నిర్వహించారు. స్వామి వారికి సువర్చలాంజనేయ శాంతి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం, పొందుగల, చంద్రగూడెం, సబ్జపాడు, జంగాలపల్లి, బొర్రగూడెం, అనంతవరం గ్రామాలకు ఆదివారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఏఈ గార్లపాటి రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇళ్లస్థలాల లేఅవుట్ల పరిశీలన



ముసునూరు: చెక్కపల్లిలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ శుక్రవారం ఇళ్ల స్థలాల లేఅవుట్లను పరిశీలించారు. అనంతరం రేషన్ డీలర్ల వద్ద జరుగుతున్న ఈకేవైసీ నమోదును తనిఖీ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆగిరిపల్లి: వేసవి ఎండలు ఎక్కువగా ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు జగన్ మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం అడవి నెక్కలంలో గ్రామస్తులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పకుండా మంచి నీరు అధికంగా తీసుకోవాలని, అవసరమైతే తప్ప బయటికి వెళ్లకూడదన్నారు.

వేంపాడు భూముల రైతుల నిరసన పాదయాత్ర

నూజివీడు: గొల్లపల్లి పంచాయతీ పరిధిలోని వేంపాడు అగ్రహారం భూముల సాగుదారులకు రాష్ట్ర ప్రభుత్వం హక్కులు కల్పించాలని కోరుతూ రైతులు శుక్రవారం గ్రామంలో నిరసన పాదయాత్ర చేపట్టి శ్రీ రఘునాథ స్వామి వారికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ రైతు దోనేటి శివాజీని దేవదాయ శాఖాధికారులు కౌలు చెల్లించాలని నిత్యం వేధింపులు చేస్తుండటంతో ఆగ్రహించిన ఆయన నిరసన పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నియోజకవర్గ నేత నిమ్మగడ్డ నరసింహ, రైతులు గోగినేని రఘు, ఒరుగు శ్రీరంగం, గోళ్ల రాజు, పొట్లూరి అశోక్ మద్దతు తెలిపారు. నరసింహ మాట్లాడుతూ ఐదు గ్రామాల్లోని 1,350 మంది వేంపాడు రైతులకు ఉరితాళ్లుగా ఉన్న జీఓ 79, 102లను ప్రభుత్వం రద్దు చేసి వేంపాడు అగ్రహార భూములపై సాగుదారులకు హక్కులు కల్పించాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. తక్షణమే స్థానిక మంత్రి కొలుసు పార్థసారథి జోక్యం చేసుకుని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

అక్రమ ఎన్‌కౌంటర్‌కు ఖండన

నూజివీడు: చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ దంతేవాడ సరిహద్దులో భద్రతా దళాలు జరిపిన ఎన్‌కౌంటర్‌ను సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని అతిక్రమించి అక్రమ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.